భయంకర హత్యలు

టెంపోరావ్

పడక కుర్చీలో కూర్చుని వాలిగారు పొడుగాటి చుట్టను లైటర్‌తో వెలిగించారు. పొగ పీల్చి వదులుతూ సాయంత్రం వెలువడే దినపత్రికను చేతిలోకి తీసుకొని చదవసాగారు.

ఎదురుగా సోఫాలో కూర్చున్నాను. పైన ఫాన్ తిరుగుతున్నా బాగా వుక్క బోస్తోంది. ఆకాశంలో నల్లటి మబ్బులు మెల్లిగా కదులుతున్నాయి. ఏ క్షణంలో నైనా వర్షం రావచ్చు!

మేమిద్దరం మద్రాసు వచ్చి మూడు రోజులయింది. ప్రత్యేకంగా మాకే పనీ లేకపోయినా వాలిగారు మాత్రం మామూలుగానే బిజీగా వున్నారు. ఒక రోజు ముఖ్య మంత్రితో సమావేశం, మరో రోజు హోమ్ మినిష్టర్ ఇంట్లో డిన్నర్, మూడో రోజున డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌తో చర్చలు! ఏదో పని లేకుండా వాలిగారు వుండలేరు.

ఆలోచిస్తూ క్షణ కాలం ఆ మహానుభావుని వైపు చూశాను. మూడు దశాబ్దాలు పైగా ఆయనతో నేను ఎన్నో భయంకర, సాహసోపేతమైన పరిశోధనల్లో పల్గొన్నాను.

కొన్ని సమయాల్లో ఆయనలాంటి మేధావి ఎప్పుడో గాని ఈ లోకంలో పుట్టడని నాకు అనిపించేది. గంభీర కంఠంతో ఆయన ఏ కేసుగురించైనా చెప్తుంటే అందరూ చెవులప్పగించి వింటూరు.

భక్తితో ఆయన వంక చూశాను. వాలిగారు ఎప్పటి లాగే వున్నారు. మనిషిలో ఏమాత్రం మార్పులేదు.

టెలిఫోన్ మ్రోగడంవలన నా ఆలోచనలకు అంత రాయం కల్గింది. వెళ్ళి రిసీవర్ని ఎత్తాను.

"హలో, గిరి స్పీకింగ్" అన్నాను.

"ఇన్స్పెక్టర్ ముకుంద్ ని. వాలిగారు వున్నారా?" అడిగాడతను.

అటువైపున్న వ్యక్తి పేరు చెప్పి వాలిగార్కి రిసీవర్ని అందించాను.

"హలో" అన్నారాయన.

కొంతసేపయ్యాక, "వస్తాను" అని ఆయన పడక కుర్చీలోంచి లేచారు.

"గిరి, వెళ్దాం పద" అని ఆయన బయటకు అడుగులు వేశారు.

హోటల్ గది తలుపు మూసి, తాళంవేసి వాలిగారిని వెంబడించాను.

XYZ కారును పోనిస్తున్నాను. వాలిగారు నా పక్కనే కూర్చున్నారు.

చుట్టపొగ పీల్చి పైకి వదులుతున్నారు. రోడ్డు దీపాలు

వెల్గుతున్నాయి. షాపుల్లోని ఫ్లోరోసెంట్ ట్యూబులు ప్రకాశిస్తున్నాయి.

టైమ్ చూశాను. తొమ్మిది కావస్తోంది. అయినావరం లోని సయానీ థియేటర్ దాటి కారు దూసుకుపోతోంది.

మా కుడివైపున పళ్ళకొట్లు అగుపిస్తున్నాయి. "గిరీ, ఆ పోలీస్ జీప్ వెనకనే ఆపు!" అన్నారాయన.

పోలీసు జీపు వెనకనే కారాపాడు. అటువైపునుంచి పరుగెత్తుకొచ్చాడు ఇన్స్పెక్టర్ ముకుంద్.

కారు తలుపు తెరిచాడు. వాలిగారు దిగారు. కిందకు వాళ్ళ దగ్గరకు వెళ్ళాను.

"వాలిగారూ, అతడికి బాగా దెబ్బలు తగిలాయి. హాస్పిటల్ కి అతడిని పంపారు. బతుకుతాడనే నమ్మకం లేదు నాకు!" అన్నాడు ఇన్స్పెక్టర్.

"మీ నమ్మకానికి విరుద్ధంగా అతడు బతుకుతాడని ఆశిద్దాం" అన్నాడు వాలిగారు.

క్షణకాలం ఆయన మౌనంగా వుండిపోయాను. నలువైపులా చూస్తున్నారు.

"ఏం జరిగిందో చెప్పు!"

"అటువైపున్న అంబాసిడర్ కారు అతనిదే. అతని పేరు గోపాలరావు. పళ్ళుకొని, బుట్టను పట్టుకొని అతడు తన కారువైపు వెళుతున్నాడు. అదే సమయంలో వెనక నుంచి వచ్చిన కారు అతడిమీదకు దూసుకుపోయింది. పళ్ళబుట్ట కింద పడింది. అతడు కారు కిందపడి నలిగి పోయాడు. ఆ కారు ఆగకుండా ముందుకు వెళ్ళిపోయింది. ఇక్కడున్నవాళ్లు అతడిని టాక్సీలో హాస్పిటల్ కు చేర్చారు. హాస్పిటల్ కు వెళ్ళి అతడిని చూసి నేను ఇక్కడకు వచ్చాను" అన్నాడు ఇన్స్పెక్టర్.

రోడ్డు అటువైపుకు, పళ్ళ కొట్లవైపు నడిచారు వాలిగారు. అప్పుడే వస్తూన్న బస్సు సడన్ బ్రేక్‌తో ఆగింది. ఇన్స్పెక్టర్ ముందు, నేనూ వెనకనే వెళ్ళాం.

రోడ్డు వారగా నేలమీద పళ్ళు చిందరవందరగా పడున్నాయి. ఆపిళ్ళు, ప్లమ్సు, బత్తాయి పళ్ళు, అనాస పళ్ళు! తాటాకుల బుట్ట వారగా పడుంది.

వాటివైపు వాలిగారు మౌనంగా చూశారు. "గోపాల రావును కూలగొట్టిన కారు నెంబర్ని యెవరేనా చూశారా?"

"చూడలేదు సార్. రోడ్డుమీద ఎంతమందో వున్నారు. ఒక్కడు కూడా చూడలేదు!" అన్నాడు ఇన్స్పెక్టర్.

"అతడు పళ్ళు ఏ షాపులో కొన్నాడు?"

వరుసగా అరడజను కొట్లున్నాయి. మొదటి కొట్టు వైపు చూపించాడు ఇన్స్పెక్టర్. అక్కడకు అందరం వెళ్ళాం.

కొట్టతను వాలిగారివైపు భయంతో చూశాడు. షాపుకు కొంచెం దూరంలో ఒక అంబాసిడర్ కారు రోడ్డు వారగా ఆపబడివుంది. గోపాలరావు కారు అదే!

"ఆ కారులో వచ్చే ఆయన ఇక్కడ తరచు పళ్ళు కొని పట్టికెళ్తూ వుంటాడా?" వాలిగారు ప్రశ్నించారు.

"ప్రతి శనివారం ఆయన పళ్ళు కొంటూ వుంటారు సార్. మంచి కస్టమర్" అన్నాడతను.

"అతడివైపు దూసుకెళ్ళిన కారును నువ్వు చూశావా?"

"చూశాను సార్."

"నెంబర్ గుర్తుందా?"

"లేదు, సార్."

వాలిగారు అతడివైపు సూటిగా చూశారు.

"రోడ్డుమీద వెళ్ళే కార్ల నెంబర్లు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. నీకు ఆ కారు నెంబరు ఎందుకు కనబడ లేదు?"

కొట్టకను వెంటనే జవాబియ్యలేదు.

"ఇప్పుడు జ్ఞాపకమొచ్చిం సార్. ఆ కారు నెంబర్ ప్లేటును ఏదో గుడ్డ కప్పేసింది"

"నిజంగా?"

"నిజం, సార్. ఆయన భయంకర అరుపు విని కారు వైపు చూశాను. నెంబరు బదులు నెంబరు ప్లేటుమీదున్న నల్లటి గుడ్డ నాకు కనిపించింది. రెప్పపాటులో ఆ కారు మాసుకుపోయింది."

"కారులో ఎంతమంది వున్నారు?"

"ఒక్కడే సార్."

"కారులో ఒక్కడే వున్నాడని మరికొందరు కూడా చెప్పారు" అన్నాడు ఇన్స్పెక్టర్.

వాలిగారు నోట్లోని చుట్ట పొగను బయిటకు వదిలి ఇన్స్పెక్టర్ వైపు చూశారు. ఏదో చెప్పబోయి, ఎందుకో చెప్పటం మాని సమీపంలో వున్న కారువైపు నడిచారు.

బ్లాక్ అంబాసిడర్ కారు!

"సి బుక్ కారులో వుంది. దాన్నిబట్టే అతడి పేరూ, అడ్రసూ తెల్సుకున్నాను" అన్నాడు ఇన్స్పెక్టర్.

వాలిగారు విచిత్రంగా నవ్వారు.

"ముకుంద్ భాయ్, సి-బుక్‌లో పేరున్న వ్యక్తేగాక ఈ కారులో మరెవరైనా ఇక్కడకు వచ్చివుండొచ్చు!" అన్నాడాయన.

"అవును, సార్."

"ఆ అడ్రెస్‌కు ఎవర్నయినా పంపావా?"

"లేదు సార్, పంపాలి" అన్నాడు ఇన్స్‌పెక్టర్.

"పంపటం అనవసరం, మేం వెళ్తాం" అన్నారు వాలి గారు.

ఇన్స్‌పెక్టర్ ముకుంద్ చెప్పిన అడ్రెసును గుర్తుంచుకున్నాను. రోడ్డుదాటి మా కారువైపు నడిచాం. ముందు సీటుమీద వాలిగారు కూర్చుని ఇన్స్‌పెక్టర్‌వైపు చూశారు.

"ఫోన్ చేసి హాస్పిటల్‌కి పంపిన వ్యక్తి ఏ స్థితిలో వున్నాడో తెలుసుకో!"

ఇన్స్‌పెక్టర ముకుంద్ పరుగెత్తుకెళ్ళి బట్టల షాపులో దూరాడు. కాస్సేపట్లో తిరిగొచ్చాడు.

"అతడు మరణించాడు!" అన్నాడు ఇన్స్‌పెక్టర్.

"ఇల్లక్!"

"వాలిగారూ, ఆ యాక్సిడెంట్ చేసి పారిపోయిన మనిషి కోసం వెతకాలి!" అన్నాడు ఇన్స్‌పెక్టర్.

"ముకుంద్ భాయ్, ఇది యాక్సిడెంట్ కాకపోవచ్చు!" అన్నాడాయన క్లుప్తంగా.

ఇన్స్‌పెక్టర్ ముకుంద్ వులిక్కిపడ్డాడు.

"ఇది హత్య అంటారా?"

"కావచ్చు! నెంబరు ప్లేటును నల్లగుడ్డ కప్పిందని అతడన్నాడు. అందువలన మనం అనుమానించాలి" అని ఆయన నావైపు చూశారు.

కారును ముందుకు పోనిచ్చాను.

2

చామియర్స్ రోడ్డుమీదున్న 10 నెంబరు ఇంటి కాంపౌండులోకి కారును పోనిచ్చి ఆపాను. అందంగా

నిర్మించిన మేడచుట్టూ చక్కటి తోట వుంది. ఇంటికి సమీపంలో పూల మొక్కలు, వాటికి దూరంగా మామిడి, కొబ్బరి చెట్లు అగుపిస్తున్నాయి.

వాలిగారూ, నేనూ కార్లోంచి దిగాం. ముందు వరండా మీదున్న లైట్ వెలుగుతోంది. ముందు తలుపు తెరిచివుంది.

గుమ్మంలో వాలిగారు నిలబడ్డారు. నేను ఎలక్ట్రిక్ బెల్ నొక్కాను. చేతికర్ర ఆధారంతో నడుస్తూ యాభై ఏళ్ళ స్త్రీ గుమ్మంవైపు వచ్చింది.

"ఎవరు?" అందామె.

"గోపాలరావు వున్నాడా?" అడిగారాయన.

"అతడు బొంబాయి వెళ్ళాడు. రేపో ఎల్లుండో వస్తాడు."

"అయితే కారులో ఎవరు వెళ్ళారు?"

"నా రెండో కొడుకు రామారావు. ఫాక్టరీనుంచి వచ్చి, శనివారం పళ్ళకోసం వెళ్ళాడు."

"మీ ముగ్గురు తప్ప ఈ ఇంట్లో మరెవ్వరూ లేరా?"

"మరెవరుంటారు? మా అమ్మాయికి పెళ్ళయిపోయింది. నౌఖర్లు పని ముగించి పోతారు."

వాలిగారు ఆమెవంక విచారవదనంతో చూశారు.

"ఇంటిలో ఫోనుందా?"

ఆమె వుందన్నట్లు తలాడించింది.

"బొంబాయిలో వున్న మీ అబ్బాయి గోపాలరావుతో ఫోన్‌లో మాట్లాడొచ్చా?" అడిగారు వాలిగారు.

"ఏం మాట్లాడాలి?"

"మీ అబ్బాయితో కొన్ని వ్యాపార విషయాలు

అర్జంటుగా మాట్లాడాలి."

"ఏ క్షణంలోనైనా రామారావు వస్తాడు. వాడితో మీరు మాట్లాడొచ్చు" అందామె.

ఆమెవైపు వాలిగారు జాలిగా చూశారు. గుడ్డిది! కళ్ళుంటే మా ముఖాలు చూసి ఏదో జరిగిందని గాభరా పడేది!

"మేం వెంటనే వెళ్ళాలి, రామారావు వచ్చిందాకా వుండలేం!" అన్నారాయన.

ఆమె ఓ క్షణం ఆలోచించింది.

"డైరక్టరీలో బొంబాయి హోటల్ ఇండియా నెంబర్ రాసివుంటుంది. రూమ్ నెంబర్ 50."

వాలిగారూ, నేనూ లోపలకు వెళ్ళాం. ఆయన నాకు సౌజ్ఞ చేశారు. ఆయన ఆమెతో మాట్లాడుతూ నిలబడ్డారు. టెలిఫోన్ సంభాషణ ఆమె వినకుండా ఉండేందుకు మాట్లాడిస్తున్నారు.

రిసీవరెత్తి కోడ్ నెంబరు తిప్పి తర్వాత హోటల్ ఇండియా నెంబర్ తిప్పాను.

"హలో, హోటల్ ఇండియా!"

"మిస్టర్ గోపాలరావు, రూమ్ నెంబర్ 50!" అన్నాను.

కాస్సేపట్లో గోపాలరావు కంఠం వినపడింది.

"హలో, ఎవరు? నేను గోపాలరావుని!"

"గోపాలరావుగారూ, మీ తమ్ముడికి యాక్సిడెంట్ అయింది. వెంటనే రావాలి."

"తమ్ముడికి ఏమైంది? వాడు ఏ స్థితిలో ఉన్నాడు?" గాభరాగా అన్నాడతను.

"ఎక్కువగా చెప్పలేను. మీరు వెంటనే రావాలి."

"నైట్ ఫ్లయిట్‌లో వస్తాను."

రిసీవర్ పెట్టేశాను. వాళ్ళవైపు వెళ్ళాను. "నేను రెండేళ్ళ క్రితం గుడ్డిదాన్నయ్యాను. రైలు యాక్సిడెంట్‌లో కళ్ళుపోయాయి. కళ్ళుపోయినా పరవాలేదు. బతికి బయటపడ్డాను. నా ఇద్దరు కొడుకులూ నాకీనాడు రెండు కళ్ళయ్యారు" అందామె.

"గోపాల్రావుతో మాట్లాడాం. ఇక వెళ్తాం" అన్నాడు వాలిగారు.

"అబ్బాయి ఏమన్నాడు?"

"ఈ రాత్రి ప్లేన్‌లో వస్తున్నాడు" అన్నాను.

"మీ అమ్మాయి ఎక్కడుంది?"

"ఇదే పట్నంలో. అది టీ నగర్‌లో వుంటోంది."

"అల్లుడి పేరు?"

"రంగరాజన్."

"వాళ్ళ అడ్రెస్ చెప్పండి!" అన్నాను.

ఆమె చెప్పింది నేను రాసుకున్నాను.

ఇద్దరం బయటకు నడిచాం. ఆమె గుమ్మంలో నిలబడింది. కారును పోనిచ్చాను.

"పూర్ లేడీ!" అని వాలిగారు చుట్ట పొగ వదుల్తూ మౌనంగా వుండిపోయారు.

3

హాల్లో గోపాలరావుకి ఎదురుగా వాలిగారూ, నేనూ కూర్చున్నాం.

గోపాలరావు వయసు 28 ఉంటుంది. ఇంకా పెళ్ళి కాలేదు. తండ్రి స్థాపించిన అరడజను ఫ్యాక్టరీలను అతడు నడుపుతున్నాడు.

క్రితం రోజే రామారావు శవం దహనం చేయబడింది.

అప్పటినుంచీ గోపాలరావు ఇంటిలోనే ఉండిపోయాడు.

"అబ్బాయి, నీ తమ్ముడి వయస్సెంత?" వాలిగారు ప్రశ్నించారు.

"నా కంటె రెండేళ్ళు చిన్న సార్. అతడికంటె రెండేళ్ళు చిన్నది మా చెల్లెలు రమా" అన్నాడతను.

వాలిగారు అతడివైపు సూటిగా చూశాడు.

"మీ తమ్ముడికి ఎవరేనా శత్రువులు ఉన్నారా?"

అతడు ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"తమ్ముడిని ఎవరేనా చంపారని మీ అనుమానమా?"

"అవును. అందుకు ఆధారా లున్నాయి."

"నాన్నగారు పోయాక అన్ని ఫాక్టరీలను నేను మేనేజ్ చేస్తున్నాను. చెల్లి పెళ్ళి అయ్యాక తమ్ముడు నాకు సహాయపడసాగాడు. రామం నాకెంతో ఆసరాగా ఉండేవాడు. వాడి జీవితం ఇలా ఆకస్మికంగా అంత రిస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు."

"నువ్వు చెప్పినది నా ప్రశ్నకు జవాబు కాదు!" అన్నాడాయన బులెట్ లా.

"తమ్ముడికి శత్రువులు లేరు సార్. వాడు బిజినెస్‌లోకి దిగి కొద్ది కాలమే అయింది. శత్రువులు ఏర్పడే అవకాశం లేదు."

గదిలో కొంతసేపు నిశ్శబ్దంగా వుంది. "వాలిగారూ, నన్నడిగితే ఇది యాక్సిడెంట్ అయివుండాలని అంటాను. ప్రమాదవశాత్తూ కారుకింద తమ్ముడు పడ్డాడు. కారు ఆపితే ఏం జరుగుతుందో అని భయపడి డ్రయివర్ కారును పోనిచ్చివుండొచ్చు" అన్నాడు గోపాలరావు.

ఆరిపోయిన చుట్టను వాలిగారు లైటర్‌తో వెలిగించారు.

"అబ్బాయి, ఇది హత్య అనుకోడం నా పొర బాటేమో! ఏది ఏమైనా త్వరలో నిజానిజాలు మనకు తెలుస్తాయి" అని వాలిగారు కుర్చీలోంచి లేచారు.

అందరం కారువైపు నడిచాం. ముందు సీటుమీద వాలిగారు కూర్చున్నారు. పక్కనే నిలబడ్డాడు గోపాల రావు.

"అబ్బాయి, నీ చెల్లెలు కాపురం సుఖంగా సాగు తోందా?" అడిగారాయన.

"వాళ్ళు ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు సార్, ఇద్దరూ సుఖంగా ఉన్నారు."

"నీ బావకు తలిదండ్రులు ఉన్నారా?"

"అతడికి తమ్ముడు తప్ప ఎవ్వరూ లేరు, సార్."

"నీ బావ ఏం చేస్తున్నాడు?"

"ఉద్యోగం చేస్తున్నాడు, భారత్ బాంక్‌లో."

"ఎప్పుడేనా అతను నిన్ను డబ్బు అడుగుతాడా?"

"ఎప్పుడూ నన్ను అడగలేదు. నేనే చెల్లెలికి ఇస్తూ వుంటాను. వచ్చే జీతంమీద అతడు జీవించాలి. మాలా అతడికి ఆశ లేదు."

"అతడి తమ్ముడు ఏం చేస్తున్నాడు?"

"ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు."

"అతడికి మీ ఫాక్టరీలో ఉద్యోగం యివ్వొచ్చుగా?"

"కొంతకాలం మా కెమికల్స్ ఫాక్టరీలో అతను పని చేశాడు. అతడు సరిగ్గా డ్యూటీకి వచ్చేవాడు కాదు. చుట్టాలకు ఉద్యోగాలివ్వడం మంచిదికాదని నేను అతడిని పొమ్మన్నాను."

"అతడు అన్నతోటే ఉంటున్నాడా?"

"అతడికింకా పెళ్ళికాలేదు. అన్నతోటే ఉంటు

న్నాడు."

వాలిగారు సౌజ్ఞ గుర్తించి కారును బయటకు పోనిచ్చాను.

4

అమావాశ్య రాత్రి అతడు ఒంటరిగా రోడ్డమ్మట నడుస్తున్నాడు. ఇళ్ళలోని వాళ్ళు నిద్రపోతున్నారు.

సిగరెట్ పీలుస్తూ అతడు మెల్లిగా అడుగులు వేస్తున్నాడు. గేటు లోపలనుంచి ఒక కుక్క అతడిని చూసి మొరిగింది.

అతడు ఆగాడు. గేటు దగ్గరకు వెళ్ళాడు—కుక్క అటువైపు వుంది. అతడిని చూసి మొరుగుతోంది. చప్పుడు చేయకుండా అతడు గేటు తెరిచాడు.

కుక్క వెనక్కుపోయి మొరుగుతోంది. జేబులోంచి రెండు బిస్కట్లుతీసి అతడు కుక్కవైపు పడేశాడు. ఆకలితో కుక్క బిస్కట్లను తినేసింది. తోక వూపుతూ అతడి దగ్గరకు వచ్చింది.

కుక్క పీకను అతడి చేతులు చుట్టేశాయి. బలంగా పిసికాడతను. కాస్సేపటిలో కుక్క అతడి చేతుల్లో చచ్చిపడుంది.

కుక్కను నేలమీదకు విసిరి అతడు గేటు మూశాడు. రోడ్డమ్మట మెల్లిగా నడవసాగాడు.

అతడు మరో సిగరెట్ వెలిగించాడు. ఆలోచిస్తూ అడుగులు వేస్తున్నాడు.

తన్ని చూసి మొరిగే కుక్కలు చావాలి!

అతడు మరికొంత దూరం నడిచాడు. చిన్న ఇంటి ముందు ఆగాడు. లోపలకు వెళ్ళి ముందు తలుపుమీద వేళ్ళతో తట్టాడు.

కాస్సేపటిలో తలుపు తెరవబడింది. అతడు లోపలకు వెళ్ళాడు. ఆమె తలుపు మూసింది. అతడివైపు నవ్వుతూ చూసింది.

"రేఖా!" అన్నాడతను.

"ఇంత ఆలస్యంగా రావద్దన్నాను!" అందామె.

"వస్తే ఏమవుతుంది?"

"అమ్మ పడుకుంది. లేస్తే నన్ను తిడుతుంది!"

అతడు నిర్లక్ష్యంగా నవ్వాడు.

"డోంట్ బాదర్! నీ తల్లి లేవకుండా నేను చూస్తాను!"

అతడు సోఫాలో కూర్చుని ఆమె వంక చూశాడు. తటాలున ఆమెను తనవైపు లాగాడు. ఆమె అతడి ఒళ్లో పడింది. విసుగ్గా లేవబోయింది. అతడామెను నొక్కి పెట్టాడు.

"మై డియర్, ఐ లవ్ యు! నీ కోసం నేను ఏదైనా చేస్తాను" అన్నాడతను.

"నన్ను వదులు!" అర్చిందామె.

"గట్టిగా అరిస్తే మీ అమ్మ లేస్తుంది!" అతడు ఆమెను వారించాడు.

"ప్లీజ్, వెళ్ళిపో! రేపు పార్కులో కలుసుకుందాం" అందామె.

అతడు జవాబివ్వలేదు. పాంటు జేబులోంచి రమ్ బాటిల్ తీశాడు. బాటిల్లోని రమ్ను అలాగే గడగడ తాగేశాడు. మరో సిగరెట్ వెలిగించాడు.

"రేఖా, పార్కులో నిన్ను కల్సుకుంటే నాకు తృప్తికరంగా లేదు. అందుకే నీ ఇంటికొచ్చాను. నన్ను పొమ్మనకు! పోడానికి నేను రాలేదు" అన్నాడతను.

ఆమె మాట్లాడలేదు. అతడి వంక చూస్తూ వుండి పోయింది.

"త్వరలో లక్షలు నా చేతిలోకొస్తాయి. అప్పుడు నిన్ను నాతో అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ వగైరా దేశాలకు తీసుకువెళ్తాను. మన జీవితం అఖండంగా ఉంటుంది!"

"చూద్దాం!" అందామె.

బాటిల్లో మిగిలిన రమ్‌ను అతడు పూర్తిగా తాగేశాడు. బాటిల్ని హాలు మూలకు విసిరాడు. అది శబ్దం చేస్తూ ముక్కలైంది!

ఆమె తృప్తిపడింది. విదిలించుకుని దూరంగా జరిగింది.

"ప్లీస్, వెళ్ళు! నిజంగా నన్ను నువ్వు ప్రేమిస్తే వెళ్ళిపో! అల్లరిచేస్తే అమ్మకు నీమీద మంచి అభిప్రాయం ఏర్పడదు! నీ గురించి అమ్మతో చెప్పాను. మన ప్రేమకు ఆమె ఎదురుపల్కదు. కాని యీ సితిలో నిన్ను చూస్తే ఆమె నిన్ను అసహ్యించుకుంటుంది!" అందామె.

అతడు కుర్చీలోంచి లేచాడు. ఆమె దగ్గరగా వెళ్ళి చేతుల్లో చుట్టేశాడు. ఎర్రటి ఆమె పెదిమలను బలంగా ముద్దెట్టుకున్నాడు.

అతడి కళ్ళల్లోకి చూసిందామె.

"నువ్వు పశువులా ప్రవర్తిస్తావు. అయినా నీ పశుబలం నన్ను ఎంతో ఆకర్షిస్తోంది. నేను ఎప్పుడూ నీదాన్నే! నీవు లేకుండా నేను బతికుండలేను. నా మాటలు నమ్ము! ఇప్పుడు వెళ్ళిపో!" అందామె.

ఆమె తలుపు తెర్చింది. అతడు మెల్లిగా గుమ్మం దాటాడు. ఆమెవైపు నవ్వుతూ చూశాడు.

"రేఖా, మళ్ళీ ఎప్పుడు?"

"రేపు సాయంత్రం, పార్క్‌లో!"

అతడు మెల్లగా రోడ్డువైపు నడిచాడు. ఆమె తలుపు మూసుకుంది. అతడు రోడ్డమ్మట వేగంగా అడుగులు వేయసాగాడు.

5

టెలిఫోన్‌లో మాట్లాడి వాలిగారు ఖంగారుగా కుర్చీ లోంచి లేచారు.

"గిరీ, పద!" అన్నారాయన.

ఇద్దరం గదిలోంచి బయటకు నడిచాం. తలుపు మూసి తాళం వేశాను. ఆయన వెనకనే వెళ్లాను.

XYZ కారుని శరవేగంగా గోపాలరావు యింటికి పోనిచ్చాను. అక్కడ ఏం జరిగిందో నాకు తెలియదు. వాలిగారు చెప్పే మూడ్‌లో లేరు. అంతా అగమ్య గోచరంగా వుంది.

కాంపౌండులో కారాపి దిగాం. ఇన్స్పెక్టర్ ముకుంద్‌ను అక్కడ చూసి ఆశ్చర్యపోయాను.

వాలిగారు హాల్లోకి వెళ్లారు. గోపాలరావు గాభరాగా వచ్చాడు. వాలిగారి చేతులు పట్టుకున్నాడు.

"వాలిగారూ, అమ్మను ఎవరో హత్య చేశారు. ఇదంతా చూస్తూంటే నా తమ్ముడు కూడా హత్య చేయబడి వుండాలని నాకు అనిపిస్తోంది" అన్నాడతను.

హాల్లోంచి పక్కనున్న గదిలోకి వెళ్లాం. గోపాలరావు తల్లి నేలమీద పడివుంది. వాలిగారు వంగి కూర్చుని ఆమెను జాగ్రత్తగా పరీక్షించారు.

మెల్లగా ఆయన లేచి నిలబడ్డారు.

"ఊపిరాడక ఆమె మరణించింది" అన్నాడు వాలిగారు.

ఆయన గోపాలరావు వంక చూశారు.

"అబ్బాయి, ఏం జరిగిందో చెప్పు!"

"వాలిగారూ, నేను తొమ్మిదింటికి ఫాక్టరీనుంచి వచ్చాను. ముసలిది నా కారు వచ్చిన చప్పుడు వినగానే ఆమె గుమ్మం దగ్గరకు వచ్చేది. కాని ఇవాళ రాలేదు. అమ్మా అని పిలుస్తూ ఆమె గదిలోకి వెళ్ళాను. ఆ స్థితిలో ఆమెను చూశాను. వెంటనే మీకూ, పోలీసువారికీ ఫోన్ చేశాను."

"సాయంత్రం ఇక్కడకు ఎవరొచ్చారో తెలుసా?" వాలిగారు ప్రశ్నించారు.

"పనివాళ్ళు ఏడు లోపల వెళ్ళిపోతారు. ఆటుపైన ఎవరెవరొచ్చారో వివరంగా తెలియదు."

వాలిగారు అతడివైపు సూటిగా చూశారు.

"నీ బావ వచ్చాడేమో!" అన్నారాయన.

"అమ్మ మరణవార్త నా చెల్లెలికి చెప్పడానికి ఫోన్ చేశాను. బావా, నా చెల్లెలూ ఇక్కడికొచ్చారు. ఏడున్నరకు వాళ్ళు వెళ్ళిపోయారట" అన్నాడు గోపాలరావు.

"వాళ్ళే నీ తల్లిని ఆఖరుసారిగా సజీవంగా చూసి వుండాలి" అన్నారాయన.

"వాళ్ళు వెళ్ళాక ఏం జరిగిందో యెవ్వరికీ తెలియదు, సార్!"

వాలిగారు గంభీరంగా నవ్వారు.

"ఆటుపైన జరిగింది మనకు తెలుసు, అబ్బాయి. నీ తల్లి మరణించింది! హంతకుడికి ఆమె బలైపోయింది!" అన్నారాయన.

గోపాలరావు వాలిగారివైపు చూశాడు.

"వాలిగారూ, ఆమె వృద్ధురాలు. ముసలిది. ఆమెను

చంపితే హంతకుడికి ఏ విధంగా లాభిస్తుంది?"

"అది మనం కనుక్కోవాలి!"

గోపాలరావు నిస్సహాయంగా సోఫాలో కూర్చుని ఏడ్వసాగాడు. ఇన్స్పెక్టర్ ముకుంద్ వాలిగారి దగ్గరకు వచ్చాడు.

"వాలిగారూ, ఇప్పుడు సందేహంలేదు. రామారావుని చంపిన వ్యక్తే ఆమెను హతమార్చి ఉండాలి" అన్నాడు ఇన్స్పెక్టర్.

"ఇదీ, ఇంతకుముందు జరిగినదీ హత్యని భావిస్తున్నందుకు నిన్ను మెచ్చుకుంటున్నాను" అన్నారాయన.

గోపాలరావు ఏడుస్తూ వాలిగారి చేతుల్ని పట్టుకున్నాడు.

"వాలిగారూ, ఎవరో మా వంశాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. నే నొక్కడినే ప్రస్తుతం బతికివున్నాను. నన్ను కూడా చంపడానికి వాళ్ళు ప్రయత్నించవచ్చు."

"అబ్బాయి, నువ్వు కూడా పోతే యెవరికి లాభిస్తుంది?" అడిగారాయన.

గోపాలరావు తృళ్ళిపడ్డాడు. వాలిగారివైపు భయంతో చూశాడు.

"వాలిగారూ, నా చెల్లెలు, నా బావ ఇదంతా చేశారంటే నేను నమ్మను!"

"అబ్బాయి, నువ్వు నమ్మినా, నమ్మకపోయినా నిజం మారదు!"

"వాలిగారూ, నాకు ఒక్కతే చెల్లెలు. దానికి ఏం కావలసినా మేం ఇస్తాం. మమ్మల్ని ధ్వంసంచేసి ఆమె

జీవించవలసిన అవుసరం లేదామెకు. బావ చిన్న ఉద్యోగంలో ఉన్నా మంచివాడు. నోరు తెర్చి అతడు నన్ను ఎన్నడూ ఏమీ అడగలేదు. అతడికి ఏం కావలసినా మేం ఇస్తాం. అది అతడికీ, నా చెల్లెలికీ తెలుసు. మీరు దయచేసి వాళ్ళను అనుమానించవద్దు!" అన్నాడు గోపాలరావు.

"అబ్బాయి, నిలకడ మీద నిజం తెలుస్తుంది" అన్నారు వాలిగారు.

6

వాలిగారూ, నేనూ హాల్లో కుర్చీల్లో కూర్చున్నాం. మాకెదురుగా రమా, రంగరాజన్ ఉన్నారు.

వాలిగారు సూటిగా రంగరాజన్ వైపు చూశారు.

"అబ్బాయి, నిన్న మీరు గోపాలరావు యింటికి వెళ్ళారు. అక్కడ యెంతవరకూ ఉన్నారు?"

"ఏడున్నర దాకా, సార్" అన్నాడు రంగరాజన్.

"అటుపైన ఎక్కడికెళ్ళారు?"

"బీచ్‌కి వెళ్ళాం. ఎనిమిది దాకా అక్కడ కూర్చుని ఇంటికి తిరిగొచ్చాం."

"ఏడున్నర తర్వాత మీరు బీచ్‌కి వెళ్ళడం ఎవరేనా చూశారా?"

"యెవ్వరూ చూడలేదు, సార్."

వాలిగారు జేబులోంచి చుట్టతీసి లైటర్‌తో వెలిగించారు.

"ఏడున్నర తర్వాత మీరు ఏం చేశారో యెవ్వరికీ తెలియదు!" అన్నాయన.

"తెలియదు" అంది రమా.

రంగరాజన్ ఆమెవైపు కోపంగా చూశాడు.

"వాలిగారూ, ఏడున్నరకి మేం గోపాలరావు యిల్లు వదిలిపెట్టాం. స్కూటర్ మీద బీచ్‌కి వెళ్ళాం. గోపాలరావు ఇంటి సమీపంలో ఉన్న సిగరెట్ షాపులో నేను సిగరెట్లు కొన్నాను. అప్పటికి టైము ఏడూ ముప్ఫయిఐదు అయివుంటుంది. ఆ షాపువాడిని అడిగితే మా గురించి అతడు మీకు చెప్పొచ్చు" అన్నాడు రంగరాజన్.

వాలి నవ్వి వూరుకున్నాడు.

"మరో విషయం. మేం ఎనిమిదిదాకా బీచ్‌లో ఉన్నాం. బీచ్‌లో ఐస్‌క్రీమ్ తిన్నాం. ఐస్‌క్రీమ్ అమ్మిన వ్యక్తితో మీరు మాట్లాడితే 7-45 ప్రాంతంలో మేం ఐస్‌క్రీం కొన్నట్లు అతడు చెప్తాడు" అన్నాడు రంగరాజన్.

అతిడివైపు వాలిగారు సూటిగా చూశారు. "డాక్టర్ రిపోర్టునుబట్టి గోపాలరావు తల్లి ఏడున్నర ఎనిమిది మధ్య మరణించింది. ఆమె మరణించాక మీరు బీచ్‌కి వెళ్ళుండొచ్చు!"

రంగరాజన్ కోపంగా కుర్చీలోంచి లేచాడు.

"వాలిగారూ, మేం వెళ్ళేసరికి నా అత్తగారు సజీవంగా వున్నారు. గుమ్మందాకా వచ్చి ఆమె మమ్మల్ని సాగనంపారు. ఆమె ఏడున్నరకు మరణించలేదు. మేం వెళ్ళిపోయాక ఆమె మరణించి ఉండాలి" అన్నాడు రంగరాజన్.

"అబ్బాయి, నువ్వు మాతో సహకరిస్తే నీ అత్తగారి హంతకుడిని నేను పట్టుకోగలను. నువ్వు భయపడవలసిన అవసరంలేదు" అన్నారాయన.

రంగరాజన్ మాట్లాడలేదు. రమా విచారవదనంతో వాలిగారివైపు చూసింది. "వాలిగారూ, అమ్మంటే

నాకెంతో ప్రేమ. ఆమె మాంతకుడిని మీరు పట్టుకో వాలని నేను ఆశిస్తున్నాను. మేం వెళ్ళిపోయేసరికి అమ్మ క్షేమంగా వుంది. ఆమె ఇలా హతమార్చబడుతుందని నేనెన్నడూ అనుకోలేదు" అంది రమా.

"అమ్మాయి, మీరు గోపాలరావు ఇంటికి వెళ్తున్నట్లు యెవరికి తెలుసు?" అడిగారు వాలిగారు.

"అనుకోకుండా మేం అమ్మను చూడ్డానికి వెళ్ళాం. మేం వెళ్తూండగా నా మరిది ఎదురయ్యాడు. ఎక్కడికని అడిగాడు. అమ్మను చూడ్డానికని నేనే చెప్పాను. సినిమా చూసివస్తానని అతడు వెళ్ళిపోయాడు. నేనూ, నా భర్తా అమ్మ ఇంటికి వెళ్ళాం" అంది రమా.

అప్పుడే హాల్లోకి ఒక యువకుడు ప్రవేశించాడు. టైటు పాంటు, ప్లాకులో వున్నాడతను. సన్నటి మీసాలు.

"వీడు నా తమ్ముడు జయదేవ్" అన్నాడు రంగ రాజన్.

"నమస్తే" అన్నాడతను.

ఆ యువకునివైపు వాలిగారు పరీక్షగా చూశారు.

"నిన్న సాయంత్రం సినిమాకెళ్తానని చెప్పావట మీ వదినతో. ఏ సినిమాకెళ్ళావు?"

"లవ్ యిన్ ది వుడ్స్ ఇంగ్లీషు సినిమాకెళ్ళాను. మూన్ థియేటర్‌లో ఆడుతోంది" అన్నాడతను.

"ఇంటికెప్పుడొచ్చావు?"

"సినిమా అయాక బుహారీలో టిఫిన్ తిని పదింటికి వచ్చాను. అన్నయ్యా, వదినా ఇంట్లోలేరు. అమ్మ మరణించిందని ఒక చీటీ రాసి వదిన టేబుల్‌మీద పెట్టింది. అది చదివి ఆశ్చర్యపోయాను. ఫోన్ చేసి అన్నయ్యతో

మాట్లాడాను."

"నువ్వు గోపాలరావు ఇంటికి వెళ్ళలేదా?"

"నిన్న వెళ్ళలేదు. ఇవాళ పొద్దుట అందరం కలిసి వెళ్ళాం" అన్నాడు జయదేవ్.

వాలిగారు కుర్చీలోంచి లేచారు. గబగబా బయటకు నడిచాడు. కారులో కూర్చొని తలుపు మూశాడు.

వాళ్ళకు బైబై చెప్పి కారు పోనిచ్చాను.

7

పడక కుర్చీలో వెనక్కి జార్లాబడి వాలిగారు తీవ్రంగా ఆలోచిస్తున్నారు. చుట్ట పొగ రింగుల్లో పైకి లేస్తోంది.

తటాలున ఆయన కుర్చీలోంచి లేచాడు. టెలిఫోన్ దగ్గరకు వెళ్ళాడు. రిసీవర్ ఎత్తి ఏదో నెంబరు తిప్పాడు. ఓ నిమిషంపాటు మాట్లాడి రిసీవర్ని పెట్టేశాడు. ఆయన మాటలు నాకు స్పష్టంగా వినపడలేదు.

పడక కుర్చీలో కూర్చొని ఆయన నావైపు నవ్వుతూ చూశాడు. ఆయన కళ్ళు తళతళ మెరుస్తున్నాయి.

"శిరీ, మబ్బులు కదులుతున్నాయి. సూర్యకాంతిని త్వరలో చూస్తాం" అన్నారాయన.

"ఏదేనా తెలిసిందా?"

"తెలియవలసినదంతా తెలిసింది. మనుషులను పావుల్లా బలిచ్చి కొందరు చదరంగం ఆడ్తారు. వాళ్ళ ఎత్తులకు పై యెత్తువేసి ఆటకట్టాలి" అన్నారాయన.

కాస్సేపు గదిలో నిశ్శబ్దంగా వుంది. ఆయనకు ఏం తెలిసిందా అని ఆలోచిస్తున్నాను. ఆయన మాటలు నాకు అర్థంకాలేదు.

"గిరీ, గోపాలరావుకు ఫోన్ చేయి" అన్నారాయన.

రిసీవరెత్తి గోపాలరావుకు ఫోన్ చేశాను. "హలో" అందో కంఠం అటువైపునుంచి.

"మీతో వాలిగారు మాట్లాడతారు" అని రిసీవర్ని ఆయనకిచ్చాను.

"అబ్బాయి, నీ తల్లి మరణంతో ఈ హత్యలు ఆగవని పిస్తోంది. నువ్వు జాగ్రత్తగా ఉండాలి!"

సమీపంలో నిలబడి శ్రద్ధగా వింటున్నాను.

"ఆ అనుమానం నీకే వచ్చిందిగా! నీ వంశాన్ని యెవరో నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారని నువ్వు నాతో అన్నావు గుర్తుందా?"

అటువైపునుంచి గోపాలరావు ఏమన్నాడో నాకు తెలియదు.

"యెందర్ని చంపినా వేసేది ఉరిశిక్షేగా?" అని వాలిగారు గంభీరంగా నవ్వాడు.

"అబ్బాయి, నువ్వు యెక్కడికేనా వెళ్తే ముందుగా నాకు ఫోన్ చేసి చెప్పు. నాకు చెప్పకుండా వెళ్తే ప్రమాదం రావచ్చు" అన్నారాయన.

ఫోన్ పెట్టేస్తపయ్యాక ఆయన రిసీవర్ని పెట్టేసి పడక కుర్చీలో కూర్చున్నారు.

* * *

గోపాలరావు నిద్రపోతున్నాడు. పడగ్గదిలో జీరో వాట్ బల్బు డిమ్‌గా వెలుగుతోంది.

దగ్గరగా మూసిన తలుపును తోసి అతడు లోపలకు వెళ్ళాడు. అడుగులో అడుగేస్తూ మంచంవైపు నడిచాడు.

గోపాలరావు వెల్లకిలా పడుకుని ఉన్నాడు. కాళ్ళ

వైపున్న తలగడను అతడు మెల్లిగా తీశాడు. క్షణకాలం నిద్రిస్తూన్న గోపాలరావువైపు చూశాడు.

అమాంతంగా తలగడను అతడి మొహంమీద పెట్టి బలంగా నొక్కి ఉంచాడు. సెకన్లు గడుస్తున్నాయి.

చీకటిలో నిలబడిన వాలిగారిని తట్టాను. ఆయన శర వేగంగా మంచంవైపు వెళ్ళారు. ఎలక్ట్రిక్ స్విచ్ నొక్కాను. గదిలో ఫ్లోరోసెంట్ లైట్ వెలిగింది.

గోపాలరావు పరుపు మీద లేచి కూర్చున్నాడు. వాలిగారి కబంధ హస్తాల్లో ఇరుక్కుని విదిలించుకోడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు జయదేవ్.

"గిరీ, ఇన్స్పెక్టర్ ముకుంద్‌కు ఫోన్ చేసి వెంటనే రమ్మను!" అన్నాడు వాలిగారు గంభీరంగా.

8

గోపాలరావు ఇంటిలోని ముందు హాల్లో అందరం కూర్చున్నాం. పైన రెండు ఫానులు తిరుగుతున్నాయి.

ఒకవైపున కుర్చీలో జయదేవ్ కూర్చొని ఉన్నాడు. అతడికిరువైపులా కాన్‌స్టేబుల్స్ వున్నారు. అతడివైపు క్షణకాలం చూసి వాలిగారు అందరివైపూ చూశారు.

"మొదట్లో నేను రంగరాజన్ని అనుమానించాను. కాని తను చెప్పిన అబద్ధం మూలంగా జయదేవ్ నా అనుమానానికి గురయ్యాడు. గోపాలరావు తల్లి హత్య చేయబడిన సాయంత్రం మూన్ థియేటర్లో ఆరే లవ్ యిన్ వుడ్స్ సినిమాకి వెళ్ళానని జయదేవ్ చెప్పాడు. ఆ థియేటర్‌కు ఫోన్ చేశాను. ఆ థియేటర్ ప్రొప్రయిటర్ భార్య పొద్దుటే చనిపోవడం వలన ఆవాడు ఆ థియేటర్ మూసివేయబడిందని మేనేజర్ చెప్పాడు. దానితో

జయదేవ్ హంతకుడై ఉండాలని భావించసాగాను."

వాలిగారు ఆగాడు. జయదేవ్ వైపు సూటిగా చూశాడు.

"జయదేవ్ మామూలు మనిషి కాడు. దుర్మార్గుడు, కిరాతకుడు. నిండు ప్రాణాలు తీయడం అతని హాబీ! కుక్కల్నీ, మేకల్నీ అకారణంగా చంపి పారేస్తాడు. ఇదంతా గిరి కనుక్కున్నాడు."

వాలిగారు నవ్వుతూ నా వైపు చూశారు.

"గోపాలరావు ఆస్తిని కాజేయడానికి జయదేవ్ చదరంగం ఎత్తుల్లా హత్యలు చేయసాగాడు. కారుకింద పడి రామారావు పోయాడు. గుడ్డిదైన తల్లిని హత మార్చాడు. నిన్న రాత్రి ఈ ఇంటిలోనే గోపాలరావును చంపడానికి ప్రయత్నం చేశాడు. నేనూ, గిరీ ఈ హత్య జరక్కుండా చూశాం. జయదేవ్ నాకు చిక్కిపోయాడు. ఈ యత్నం ఫలించి వుంటే తర్వాత అతడు తన అన్ననే చంపేవాడు! అంతా ఆస్తి కోసం! డబ్బు కోసం! జయదేవ్ ఎటువంటి పిశాచమో దీన్నిబట్టి మీరు వూహించుకోవచ్చు" అన్నారాయన గంభీరంగా.

"నువ్వింత పిశాచానివని నేను అనుకోలేదు!" అన్నాడు రంగరాజన్ జయదేవ్ వైపు చూస్తూ.

జయదేవ్ మాట్లాడలేదు. అతడి మొహంలో భయం లేదు. ఎవరేమన్నా లెక్కచేయకుండా అలాగే కూర్చు న్నాడు.

వాలిగారు చుట్ట పొగవదులుతూ అందరి వైపు చూశాడు.

"జయదేవ్ అమాయకురాలైన రేఖను తన మాటల్తో

ఆకర్షించాడు. అతడు పోలీసులకు చిక్కడం మూలంగా ఆమె రక్షించబడింది" అన్నాడు వాలిగారు.

"వాలిగారూ. మీరు నా కళ్ళు తెరిచారు. నన్ను కాపాడారు" అంది రేఖ ఆయనవైపు చూస్తూ.

"ఈ హత్యల విషయంలో నాకెంతో సహాయపడినందుకు మీకు నా ధన్యవాదాలు" అన్నాడు ఇన్స్పెక్టర్ ముకుంద్.

—: అయిపోయింది :—